ఇన్‌స్టా ముసుగులో వలపువల

- ఎన్నారైని బ్లాక్‌మెయిల్ చేసి నిశ్చితార్థం
- భారీగా డబ్బు వసూలుకు ప్లాన్
- బాధితుడి ఫిర్యాదుతో యువతి అరెస్టు
- విశాఖపట్నంలో వెలుగుచూసిన ఘటన

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ) : ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయాలతో యువకులను ముగ్గులోకి దింపి వారి నుంచి డబ్బులు గుంజుతూ మోసాలకు పాల్పడుతున్న యువతిని ఏపీ పోలీసులు అరెస్టుచేశారు. భీమిలి సీఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నంలోని మురళీనగర్‌కు చెందిన కొరుప్రోలు జోయ్ జమీనా అమెరికాలో ఉంటున్న ఎన్ఆర్ఐ మనోహర్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం పెంచుకున్నది. వైజాగ్‌లో నివాసముంటున్న ఆ యువకుడి తల్లిదండ్రుల వద్దకు వెళ్లి మనోహర్ స్నేహితురాలిని అంటూ పరిచయం చేసుకున్నది. కొన్ని రోజుల పాటు వారితో మంచిగా నటిస్తూ మీ అబ్బాయిని పెళ్లి చేసుకుంటానని చెప్పగా వారు నిరాకరించారు. దీంతో ఆమె అమెరికా నుంచి యువకుడిని రప్పించి ఎయిర్‌పోర్ట్ నుంచి నేరుగా మురళీనగర్ ఎన్జీవో కాలనీలోని తన ఇంటికి తీసుకెళ్లింది. మత్తు పానీయం ఇచ్చి ఇరువురు సన్నిహితంగా ఉంటున్నట్టు ఫొటోలు తీసింది. వాటితో తనను పెళ్లి చేసుకోవాలని బ్లాక్‌మెయిల్ చేసింది. భీమిలిలోని ఓ రెస్టారెంట్‌లో రూ.5 లక్షలు ఖర్చు చేయించి తన స్నేహితుల సమక్షంలో బలవంతంగా నిశ్చితార్థం చేయించుకున్నది. అనంతరం పెళ్లి చేసుకోకపోతే అభ్యంతరకర ఫొటోలను బహిర్గతం చేస్తానని బెదిరిస్తూ వేధింపులకు గురిచేసింది. ఎన్నారై మనోహర్‌ను రోజుల తరబడి ఇంట్లో బంధించింది. ఎట్టకేలకు ఆమె నుంచి తప్పించుకున్న బాధితుడు.. ఈ నెల 4న భీమిలి పోలీస్‌స్టేషన్‌లో యువతిపై ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు నిందితురాలి నుంచి ల్యాప్‌టాప్, మూడు సెల్‌ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నారు. గతంలోనూ ఇదే తరహాలో పలువురిని మోసగించి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు నిర్ధారించి నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



నోటీసు చూపిస్తున్న చంద్రనాయక్



కోర్టు నుంచి వచ్చిన నోటీసు

తెలంగాణ ఉద్యమకారులకు కోర్టు నోటీసులు

- సకలజనుల సమ్మెలో ఆర్టీసీ బస్సు ఆపినందుకు..
- అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు
- నవంబర్ 19న హాజరుకావాలని 28 మందికి సమన్లు

మహబూబ్‌నగర్, అక్టోబర్ 6: ప్రత్యేక రాష్ట్రం కోసం 2011లో సకల జనుల సమ్మె సమయంలో అప్పటి తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ఆర్టీసీ బస్సులను ఆపారు. అందుకుగానూ.. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం మహబూబ్‌నగర్ ఉద్యోగ సంఘం నాయకులపై అక్రమ కేసులను బనాయించింది. తాజాగా మళ్లీ పాత కేసులను బయటకు తీసి వారికి నోటీసులు పంపడం బాధాకరం. 28 మంది తెలంగాణ ఉద్యమకారులకు నోటీసులు పంపి.. నవంబర్ 19న కోర్టుకు హాజరు కావాలని పేర్కొన్నది. మహబూబ్‌నగర్ జిల్లాలో ఉద్యమాన్ని తమ భుజస్కంధాలపై మోస్తూ సబ్బండ వర్గాలను ఏకం చేసిన ఉద్యోగ సంఘం నాయకులకు తాజాగా నోటీసులు రావడంతో ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నోటీసులందుకున్న 28 మందిలో 15 మంది ఇప్పుడు ఉద్యోగ విరమణ పొందారు. వారి వయస్సు 70 ఏండ్ల పైబడింది. నలుగురు మహిళా ఉద్యోగులు ఉన్నారు. ఇప్పటికైనా ఆ కేసును రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని ఉద్యమ నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కనుల పండువగా గంగానీళ్ల జాతర

సారంగాపూర్/దిలావర్‌పూర్, అక్టోబర్ 6 : నిర్మల్ జిల్లా సారంగాపూర్, దిలావర్‌పూర్ మండలాల్లో గంగానీళ్ల జాతర అంగరంగా వైభవంగా ముగిసింది. ఆదివారం భక్తులు వేకువజామునే ఆలయానికి చేరుకున్నారు. పవిత్ర కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి క్యూలో నిలబడి మొక్కులు తీర్చుకున్నారు. గంగానీళ్ల జాతరను పురస్కరించుకొని నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్ జిల్లాలతోపాటు మహారాష్ట్రలోని నాగపూర్, నాందేడ్, ఇస్లాపూర్, హిమాయత్‌నగర్ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి పోచమ్మ తల్లికి మొక్కలు చెల్లించుకున్నారు.

- కూష్మాండ మాతగా ఏడుపాయల దుర్గమ్మ

మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం దుర్గమ్మ కూశ్మాండ మాత అలంకరణతో దర్శనమిచ్చారు. – పాపన్నపేట

- మహాలక్ష్మి అలంకరణలో..

మహబూబ్‌నగర్‌లోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారిని రూ.6,66,66,666తో అలంకరించారు. – పాలమూరు

- లలితా త్రిపురసుందరీ దేవిగా కనకదుర్గమ్మ

విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు లలితా త్రిపురసుందరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులతో ఇంద్రకీలాద్రి కిక్కిరిసిపోయింది. – హైదరాబాద్, నమస్తే తెలంగాణ

- ముత్యపు పందిరి వాహనంపై శ్రీవారు

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం మలయప్పస్వామి ముత్యపు పందిరి వాహనంపై స్వామి వారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. – హైదరాబాద్, నమస్తే తెలంగాణ

డొక్కు బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులు

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఆర్టీసీలో డొక్కు బస్సుల స్థానంలో కొత్తగా ఎలక్ట్రిక్ బస్సులను తెచ్చేందుకు సంస్థ ప్లాన్ చేస్తున్నది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి గత పదేండ్లలో ఏకంగా 6,680 డొక్కు బస్సులను ఆర్టీసీ తుక్కు కింద వేలం వేసి అమ్మేయగా, వాటిస్థానంలో 4,226 బస్సులను కొనుగోలు చేసింది. ప్రస్తుతం వెంటనే తుక్కుగా మార్చాల్సిన 1,213 డొక్కు బస్సుల స్థానంలో కొత్తవాటిని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వానికి ఇటీవలే ఆర్టీసీ నివేదిక పంపింది. పీఎం ఈ డ్రైవ్ పథకంలో హైదరాబాద్ నగరానికి ఎలక్ట్రిక్ బస్సులు ఇవ్వాలని సంస్థ ఇప్పటికే దరఖాస్తు చేసుకొన్నది. నగరం అవసరాల కోసమే రాష్ట్ర ప్రభుత్వం మరో 2,300 ఎలక్ట్రిక్ బస్సులను అద్దెకు తీసుకునే చాన్స్ ఉన్నట్టు తెలుస్తున్నది. ఒక్కో బస్సు ధర రూ.1.85 కోట్లు ఉండడంతో అద్దెకు తీసుకోవాలని యోచిస్తున్నది.

సింగూరు రెండు గేట్లు ఎత్తివేత

పుల్కల్, అక్టోబర్ 6: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని సింగూరు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. ఆదివారం 6, 11వ నంబర్ గేట్లు 1.50 మీటర్ల మేర ఎత్తి 11,026 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. విద్యుత్తు ఉత్పత్తి కోసం జెన్కోకు 2,796 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఆదివారం 13,076 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో, 14,453 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో కొనసాగినట్టు ప్రాజెక్టు ఏఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా, 29.708 టీఎంసీలు నీరు ఉన్నట్టు అధికారులు వెల్లడించారు.

ఈబీసీలపై కాంగ్రెస్ వైఖరేంటి?: రవీందర్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ) : ఈబీసీలపై కాంగ్రెస్ పార్టీ వైఖరేమిటో స్పష్టం చేయాలని, ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని ఈబీసీల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వీ రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈబీసీల జోలికొస్తే దేశ వ్యాప్తంగా ఉద్యమిస్తామని కాంగ్రెస్ పార్టీని హెచ్చరించారు.

గోమాతకు పుట్టిన రోజు వేడుకలు

జగిత్యాలజిల్లా బీర్‌పూర్‌లో ఓ రైతు కుటుంబం లేగదూడకు పుట్టినరోజు వేడుకలు నిర్వహించింది. బైరవేని సత్యనారాయణ- భాగ్యలక్ష్మి దంపతులు పెంచుకుంటున్న ఆవుకు పుట్టిన లేగదూడకు ఆదివారంతో సంవత్సరం నిండింది. ఈ క్రమంలో వేద పండితుడి ఆధ్వర్యంలో గోమాతకు పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కేట్ కట్ చేసి.. స్థానికులకు స్వీట్లు పంపిణీ చేశారు. – సారంగాపూర్

మానాన్నను ఆదుకోండి..

వైద్యానికి డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్న పిల్లలు

వీర్నపల్లి, అక్టోబర్ 6: అనారోగ్యంతో బాధపడుతున్న తన తండ్రిని కాపాడాలని పిల్లలు వేడుకుంటున్నారు. మండలంలోని గర్జనపల్లికి చెందిన నలిమేట శంకర్ ఉపాధి కోసం రెండేళ్ల కిందట దుబాయ్ వెళ్లాడు. దవడకు చిన్న గడ్డ ఏర్పడడంతో చికిత్స కోసం ఇంటికి చేరుకున్నారు. కరీంనగర్‌లోని ఓ దవాఖానలో పరీక్షలు చేయించగా, క్యాన్సర్‌గా నిర్ధారణ అయింది. కుటుంబ సభ్యులు రూ.5 లక్షలు అప్పు చేసి చికిత్స చేయించారు. అయినప్పటికీ ఆరోగ్యం క్షీణిస్తుండడంతో మెరుగైన వైద్యానికి రూ.10 లక్షలు అవసరమవుతాయని వైద్యులు తెలిపారు. ఉపాధి లేక కుటుంబ పోషణకు గల్ఫ్ వెళ్లిన కొడుకు అనారోగ్యంతో ఇంటికి చేరడంతో శంకర్ తల్లి ముత్తవ్వ ఇటీవల చనిపోయింది. తండ్రి వైద్యానికి డబ్బులు లేకపోవడంతో కుమారుడు హరిహరణ్, కూతురు శ్రీనిధి చదువులు మధ్యలోనే ఆపివేశారు. తమ తండ్రిని ఎలాగైనా కాపాడాలని పిల్లలు వేడుకుంటున్నారు. ప్రభుత్వం, మానవతావాదుల స్పందించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు. దాతలు పంపాల్సిన వివరాలు.. నలిమేట శంకర్, అకౌంట్ నంబర్ 79030435804, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ SBIN0RRDCGB, తెలంగాణ గ్రామీణ బ్యాంకు, వీర్నపల్లి శాఖ.

అదుకోవాలని వేడుకుంటున్న శంకర్ భార్య, పిల్లలు

మనోహర్ రెడ్డి పరామర్శ

చందుర్తి,అక్టోబర్ 6: బండపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కోరె మల్లేశం భార్య 'కేతవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఎన్గల్ గ్రామంలో అనారోగ్యంతో మరణించిన ఆటో కార్మికుడు' వాసం ప్రసాద్ తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బీ రాజయ్య, రామిడి దేవయ్య కుటుంబాలను బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. మండలాధ్యక్షుడు ఎల్లయ్య, మాజీ సర్పంచ్ అంజయ్య, నాయకులు ప్రసాద్,మనోహర్, రమేశ్ తదితరులున్నారు.

చేసిందే వైద్యం.. ఇచ్చిందే మందు

- పల్లెల్లో రెచ్చిపోతున్న ఆర్ఎంపీ, పీఎంపీలు
- ప్రాథమిక చికిత్స మాటున అచ్చీరాని వైద్యం
- యథేచ్ఛగా నిబంధనలకు నీళ్లు.. అడ్డంగా దోపిడీ
- అనుమతుల్లేకుండానే మెడికల్ షాపుల నిర్వహణ
- పట్టని వైద్యాధికారులు

అమాయక ప్రజలే లక్ష్యంగా ఆర్ఎంపీ, పీఎంపీలు రెచ్చిపోతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పల్లెల్లో ప్రైవేట్ క్లినిక్‌లు తెరిచి అందినకాడికి దోచుకుంటున్నారు. చాలా మంది విద్యార్హత పది, పన్నెండే! కానీ పేరుకు ముందు 'డాక్టర్' పెట్టుకొని, చేతిలో స్టెతస్కోపు పట్టుకొని చెలరేగిపోతున్నారు. జ్వరమో, తలనొప్పి వస్తే టాబ్లెట్ ఇచ్చి ఊరుకోక పరిధి దాటి వైద్యం చేస్తూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఇందుకు బోయినపల్లి మండలంలోని ప్రాథమిక వైద్యులే నిదర్శనంగా నిలుస్తున్నారు. సొంతంగా మెడికల్ షాపులు నిర్వహించడమే కాదు పట్టణాల్లో పలు దవాఖానలు ఇచ్చే కమీషన్ల కోసం సీరియస్ నెస్ సృష్టించి అక్కడికి పంపిస్తూ సొమ్ము చేసుకుటున్నారు. ఇంత జరుగుతున్నా చోద్యం చూస్తున్న ఉన్నతాధికారుల తీరుపై పలువురు మండిపడుతున్నారు.

బోయినపల్లి, అక్టోబర్ 6 : ప్రాథమిక వైద్యం మాత్రమే చేయాల్సిన ఆర్ఎంపీ, పీఎంపీలు పరిధి దాటి ముందుకెళ్తున్నారు. యథేచ్ఛగా నిబంధనలు విస్మరిస్తూ అచ్చీరాని వైద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. బోయినపల్లి మండలంలో 16 గ్రామాలు ఉండగా, దాదాపు 60– 65 మంది ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు ఉన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. ప్రజలకు ప్రాథమిక వైద్యం మాత్రమే చేయాల్సి ఉంటుంది. ఇంజక్షన్ కూడా ఇవ్వరాదు. కానీ ఇందులో మెజార్టీ ప్రాక్టిషనర్స్ నిబంధనలకు తూట్లు పొడుస్తూ రోగులకు వేములవాడలోని ఓ ల్యాబ్‌లో రక్త, మూత్ర పరీక్షలు చేయిస్తూ వైద్యమే చేస్తున్నారు. గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా సొంతంగా క్లినిక్‌లు, మెడికల్ దుకాణాలు ఏర్పాటు చేసుకొని అటు వైద్యం చేస్తూ, ఇటు మందులు రాసుకుంటూ అంది న కాడికి దోచుకుంటున్నారు. అయితే ఆర్ఎంపీల వైద్యంతో మండలంలో పలువురు ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్న ఘటనలూ లేకపోలేదు.

కమీషన్ల కోసం రిఫర్ల మీద రిఫర్లు

ఆర్ఎంపీలు వైద్యంతో రోగం తగ్గిందా..? ఓకే, లేదంటే వ్యాధి ముదిరిన తర్వాత కమీషన్ల కోసం వారికి నచ్చిన దవాఖానకు పంపిస్తూ బిల్లులో పర్సంటేజీలు కూడా తీసుకుంటున్నారు. ఇటీవల కోరెంలో కిడ్నీ, లివర్ ఇతర సమస్యలతో బాధపడుతున్న వ్యక్తిని కిడ్నీ, లివర్ సంబంధిత వైద్యుడి వద్దకు పంపాల్సిన ఆర్ఎంపీ, కమిషన్ల కోసం దారుణం చేశాడు. వేములవాడ గైనకాలజిస్టు వైద్యురాలి వద్దకు పంపించాడు. అక్కడ కూడా వ్యాధి నయం కాకపోవడంతో మళ్లీ ఆయనే కరీంనగర్ గైనకాలజిస్టు వద్దకు పంపి చికిత్స చేయించాడు. అక్కడా అదే పరిస్థితి. తిరిగి హైదరాబాద్‌లోని దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఇలా ఆర్ఎంపీలు యథేచ్ఛగా నిబంధనలు విస్మరిస్తూ వైద్యం పేరిట పేదల జీవితాలతో ఆడుకుంటున్నా పట్టని జిల్లా అధికారులపై మండల ప్రజలు మండిపడుతున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ఆర్ఎంపీ, పీఎంపీలు ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలి. అనుమతులు లేకుండా మెడికల్ షాపులు నిర్వహించినా చర్యలు తీవ్రంగా ఉంటాయి. మెడికల్ షాపు పెట్టుకోవాలంటే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నుంచి అనుమతి ఉండాలి. ఎంఫార్మసీ చేసిన వ్యక్తి మెడికల్ షాపులో ఉండి మందులు ఇవ్వాలి. ఎవరైనా నిబంధనలకు వ్యతిరేకంగా వైద్యం అందించినా, దుకాణం నిర్వహించినా వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. బాధితులు ఉంటే రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

- వసంతరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

సనుగుల్లో బెల్ట్ షాపు వేలం

చందుర్తి, అక్టోబర్ 6: మండలం సనుగుల గ్రామంలో బెల్ట్ షాపునకు గ్రామ అభివృద్ధి పేరిట కొందరు వ్యక్తులు బెల్ట్‌షాప్‌నకు పంచాయతీ ఆవరణలో శనివారం వేలంపాట నిర్వహించగా, ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామంలో గతంలో ఐదు బెల్ట్ షాపుల వరకు ఉండేవన్నారు. ఇటీవల గ్రామంలోని కొందరు వ్యక్తులు గ్రామాభివృద్ధి పేరిట ఒక కమిటీని నియమించుకొని గ్రామాభివృద్ధి కోసం ముందుగా బెల్ట్‌షాప్ నిర్వాహకులను షాప్‌కు ఒక్కొక్కరికి 20 వేలు ఇవ్వాలని కోరగా, వారు నిరాకరించడంతో బెల్ట్‌షాప్‌నకు వేలంపాట నిర్వహించారు. దీంతో ఇద్దరు వ్యక్తులు వేలంపాటలో పాల్గొని లక్ష వరకు వేలం పాట పాడి దక్కించుకున్నట్లు తెలిపారు. గ్రామంలో బెల్ట్‌షాప్‌తో మద్యం అధిక ధరలకు విక్రయిస్తున్నారని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని మద్యం ప్రియులు వాపోతున్నారు.

విజయవంతం చేయాలి

తెలంగాణ చౌక్, అక్టోబర్ 6 : జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో సోమవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే స్పోర్ట్స్ మీట్‌ను విజయవంతం చేయాలని ఆదివారం ఒక ప్రకటనలో ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని మినీస్టేడియంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

క్రికెట్ అసోసియేషన్ ఎన్నిక

వీర్నపల్లి, అక్టోబర్ 6: మండల క్రికెట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుగులోత్ బలరాంనాయక్, ఉపాధ్యక్షులుగా భూక్యా రవినాయక్, దాసరి శంకర్, వీటూరి సతీశ్, ప్రధాన కార్యదర్శి మాడ్గుల చందు, సంయుక్త కార్యదర్శులుగా రాకేశ్‌గౌడ్, జక్కుల నరేశ్, కోశాధికారి లకావత్ రాజేందర్, సలహాదారులుగా చాంద్‌పాషా, లింబాద్రి, గణేశ్, హజునాయక్, కార్యవర్గ సభ్యులుగా జైపాల్‌రెడ్డి, రవీందర్, శ్రీనివాస్, జగన్‌ను ఎన్నుకున్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

చందుర్తి అక్టోబర్ 6: మండలంలోని ఎన్గల్ గ్రామంలో ఓ ఇంట్లో నిలువ చేసిన పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు ఆదివారం రాత్రి పట్టుకున్నారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సనుగుల గ్రామ శివారులోని గంగిరెడ్డుల కాలనీ చెందిన కొందరు వ్యక్తులు సిరిసిల్ల, వేములవాడ ప్రాంతాలకు తరలించేందుకు గ్రామంలోని ఓ ఇంట్లో పీడీఎస్ బియ్యాన్ని నిల్వ చేసినట్లు తెలిపారు. బియ్యం దాదాపు 25 క్వింటాళ్లకు పైగా ఉంటాయని పేర్కొన్నారు. పట్టుకున్న బియ్యాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసి, ద ర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బాపు తెలిపారు.

ఎల్లారెడ్డిపేట : బొప్పాపూర్‌లో గురువులు, బాల్యమిత్రులతో పూర్వ విద్యార్థులు

ముస్తాబాద్ : గురువులతో పదో తరగతి విద్యార్థులు

చందుర్తి : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు,ఉపాధ్యాయులు

సిరిసిల్ల టౌన్ : పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనాలు

ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్న పూర్వ విద్యార్థులు

చందుర్తి, అక్టోబర్ 6 : మల్యాల ప్రభుత్వ పాఠశాలకు చెందిన 2003–2004 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యా బుద్ధులు నేర్పించిన గురువులను సన్మానించారు. అనంతరం ఒకరికొకరు పలకరించుకుంటూ గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులు ప్రభాకర్, దేవయ్య, మమత, పూర్వ విద్యార్థులు గణేశ్, సురేశ్, అంజి, వెంకటేశ్, రవి, సతీశ్, సాగర్, గంగాధర్, మంజుల, పుష్పలత, భారతి, గౌతమి తదితరులు ఉన్నారు.

బోయినపల్లి జడ్పీ పాఠశాలలో..

బోయినపల్లి: బోయినపల్లి జడ్పీ పాఠశాలలో ఆదివారం 1991–1992 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం పూర్వ విద్యార్థి షేక్ గౌస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 32 ఏండ్ల తర్వాత కలుసుకోగా, ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం వివిధ రంగాల్లో రాణించిన వారిని సన్మానించారు.

బొప్పాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ..

ఎల్లారెడ్డిపేట : బొప్పాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన 2005–06 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ముందుగా గురువులను సన్మానించి, ఆనాటి మధుర జ్ఞాపకాలను వేదికపై పంచుకున్నారు. బాల్య మిత్రులతో కలిసి సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. పాఠశాలకు రూ. 30 వేలు వితరణగా అందజేశారు. ఆనాటి ఉపాధ్యాయులు నర్సయ్య, దేవదాసు, నాగేంద్రం, శ్రీనివాస్‌రెడ్డి, నవీన్, ప్రభాకర్ ఉన్నారు.

ముస్తాబాద్ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 2000–2001 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని సంతోషంగా గడిపారు. ముందుగా ఆనాటి గురువులు ఆనందరావు, సుధాకర్ రెడ్డి, అశోక్, వడ్లకొండ చంద్రం, హెచ్ఎం రవీందర్‌ను సన్మానించారు. పూర్వ విద్యార్థులు మల్లారపు సంతోష్ రెడ్డి, మెంగని మనోహర్, తుమ్మ రాజేందర్, బండారు శ్రీకాంత్, రాచమడుగు రాజు, పెంజర్ల బాల ఎల్లం, దబ్బెడ చంద్రం, నీలం సత్యనారాయణ, పుల్లూరి రాజు, మద్దికుంట రాజు, గున్నాల వెంకటస్వామి, మట్ట ప్రవీణ్, వరద రాజు, సంగీత, గిరిజ, తదితరులున్నారు.

జిల్లెల్ల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో..

సిరిసిల్ల రూరల్: తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 1997–98లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఒక్కచోట కలిశారు. 26 ఏండ్లకు కలుసుకొని ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరవేసుకొని, సంతోషంగా గడిపారు. అనంతరం ఆనాటి గురువులను ఆత్మీయంగా సన్మానించారు.

విజ్ఞానవర్ధిని హైస్కూల్‌లో..

సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 6 : సిరిసిల్ల పట్టణంలోని విజ్ఞానవర్ధిని హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జిల్లా కేంద్రంలోని లహరీ గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. 2005–06 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులంతా ఒకే వేదికపై కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని సందడి చేశారు.

సిరిసిల్ల రూరల్ : జిల్లెల్లలో పూర్వ విద్యార్థులు

బోయినపల్లి : గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు